సాక్షి
కామారెడ్డి
శనివారం । 13 । జనవరి । 2024



కంపు కొడుతున్న బస్టాండ్

బాన్సువాడ బస్టాండ్ అధ్వానంగా మారింది. ప్రాంగణంలో మురికి నీరు నిలిచి దుర్వాసన వస్తోంది.

- 11లో ▸



స్కూళ్లలో సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి సంబరాలను జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /15.2

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలితీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

పార్లమెంట్ ఎన్నికల్లోనూ గెలుస్తాం

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



నిజాంసాగర్(జుక్కల్): అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. రాహుల్ గాంధీ ప్రధానిని చేయడమే లక్ష్యంగా గడపగడపకు ప్రభుత్వ పథకాలను తీసుకెళ్తామన్నారు. శుక్రవారం వెల్గనూర్‌లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహిషాసురమర్ధిని అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తల పోరాటం, ఎన్నికల మెనిఫెస్టో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్, నాయకులు మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మల్లయ్యగారి ఆకాశ్, మనోజ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఎస్‌హెచ్‌వోగా చంద్రశేఖర్‌రెడ్డి



కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌వోగా కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కే.చంద్రశేఖర్‌రెడ్డికి పోస్టింగు ఇచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌హెచ్‌వో నరేశ్ హైదరాబాద్ సీఐడీ విభాగానికి బదిలీ అయ్యారు. రాష్ట్రంలోని పలువురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీ జోన్ ఐజీ తరుణ్ జోషి శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇందులో భాగంగా చంద్రశేఖర్ రెడ్డిని పట్టణ ఎస్‌హెచ్‌వోగా నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

ఇద్దరు మెడికల్ ఆఫీసర్లకు మెమోలు

కామారెడ్డి టౌన్: దేవునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు గైర్హాజరు ఘటనపై డాక్టర్ జోహా ముజీబ్‌తో పాటు మరో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్యలకు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ శుక్రవారం మెమోలు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. వారి నుంచి వివరణ వచ్చాక ఉన్నతాధికారులకు సమర్పిస్తామని విచారణాధికారి డిప్యూటీ డీఎంహెచ్‌వో 'సాక్షి'తో తెలిపారు. నివేదికలు వచ్చిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ తెలిపారు. 10, 11 తేదీల్లో వైద్యురాలు విధులకు రాకపోయినా నకిలీ సంతకాలు ఉండడం, అధికారి విచారణ వస్తున్నారని తెలిసి సిబ్బంది సీఎల్‌గా రిజిస్టర్‌లో మార్చడంపై విచారణ ఇంకా కొనసాగుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో మెడికల్ ఆఫీసర్ దివ్య శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ 10న వైద్యురాలు వచ్చి సంతకాలు చేసినట్లు తెలిపారు. వైద్యురాలు వస్తే సీఎల్‌గా ఎందుకు దిద్దారని, 11న హాజరుకాకపోయినా సంతకాలు ఎలా ఉన్నాయని ప్రశ్నించడంతో స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. ఆమె వస్తే సీసీ ఫుటేజీలో రికార్డు అవుతుంది కదా అని ప్రశ్నించగా తనకు తెలియదని చెప్పారు.

రెండు రేషన్ దుకాణాలపై చర్యలు

కామారెడ్డి క్రైం: రేషన్ డీలర్లు తూకంలో అవకతవకలకు పాల్పడినా, సమయపాలన పాటించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్‌వో మ ల్లిఖార్జున్ బాబు హెచ్చరించారు. శుక్రవారం కామారెడ్డిలోని పలు చౌక ధరల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని చోట్ల గోనె సంచులను పెట్టి తూకం వేస్తున్నట్లు గమనించినట్లు తెలిపారు. అలా తూకం వేస్తే లబ్ధిదారుడు ఆ సంచి బరువు (దాదాపు 600 గ్రాముల) బియ్యాన్ని కోల్పోతారన్నారు. ఎలక్ట్రానిక్ తూకం యంత్రంపై గోనె సంచిని ఉంచి బియ్యం తూకం వేస్తున్న ఒక చౌక ధర దుకాణాన్ని, సమయపాలన పాటించని మరో దుకాణాన్ని గుర్తించి శాఖాపరంగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆర్డీవోకు నివేదిక పంపామని వెల్లడించారు. జిల్లాలోని చౌక ధరల దుకాణాలను ఇకపై క్రమం తప్పకుండా తనిఖీ చేస్తుంటామని తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఏఎస్‌వో నిత్యానందం పాల్గొన్నారు.

కండువా మార్చేద్దామా!

- పార్టీ మారే యోచనలో ద్వితీయశ్రేణి నేతలు
- అధికార పార్టీ వైపు మొగ్గు
- పార్టీ వీడిన వారు మెల్లిగా సొంతగూటికి..
- ఎంపీ ఎన్నికల నేపథ్యంలో డోర్లు తెరిచిన కాంగ్రెస్



సాక్షి, కామారెడ్డి: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ప్రతిపక్ష పార్టీల్లో.. ముఖ్యంగా బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న నేతలు, ప్రజాప్రతినిధులు అధికార పార్టీలో చేరేందుకు సై అంటున్నారు. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న వారు మరోసారి ఎన్నికల బరిలో నిలిచి గెలవాలన్న ఆరాటంతో కండువా మార్చుకునేందుకు రెడీ అవుతున్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, విండో చైర్మన్లు పలువురు కాంగ్రెస్ వైపు తొంగి చూస్తున్నారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలుండగా, గత ప్రభుత్వంలో స్పీకర్‌గా పనిచేసిన పోచారం ఒక్కరే మొన్నటి ఎన్నికల్లో విజయం సాధించారు. మిగతా చోట్ల బీఆర్‌ఎస్ పార్టీ ఓటమి చెందింది. దీంతో బీఆర్‌ఎస్‌కు చెందిన కొందరు నాయకులు సొంత అవసరాల కోసం కాంగ్రెస్‌లో చేరాలని ఉబలాటపడుతున్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎవరు వచ్చినా చేర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ డోర్లు తెరిచింది. దీంతో పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు హస్తం గూటికి చేరడానికి ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన పాతవారంతా తిరిగి సొంతగూటికి చేరడానికి మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో గులాబీ పార్టీలో చాలా కాలంగా కొనసాగి పదవులు అనుభవించిన వారు సైతం పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

కొనసాగుతున్న వలసలు..

అసెంబ్లీ ఎన్నికలకు ముందే కొందరు నాయకులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి లింగంపేట జెడ్పీ టీసీ సభ్యురాలు శ్రీలత, ఆమె భర్త సంతోష్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి, కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూరు ఎంపీపీ గాల్‌రెడ్డి, దోమకొండ జెడ్పీటీసీ సభ్యుడు తిర్మల్‌గౌడ్‌లు హస్తం గూటికి చేరారు. ఎన్నికల అనంతరం కూడా వలసలు కొనసాగుతున్నాయి. గతంలో కాంగ్రెస్‌లో కొనసాగి వివిధ కారణలతో గులాబీ తీర్థం పుచ్చుకున్న వా రిలో చాలామంది తిరిగి కాంగ్రెస్ వైపు తొంగి చూ స్తున్నారు. ఇప్పటికే పలువురు నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తాజాగా శుక్రవారం బీఆర్‌ఎస్‌కు చెందిన కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌రావు కాంగ్రెస్‌లో చేరిపోయారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియ, ఆమె భర్త చంద్రశేఖర్‌రెడ్డి, మరో కౌన్సిలర్ వంశీలు కాంగ్రెస్‌లో చేరారు. తర్వాత ఐదుగురు కౌన్సిలర్లు మామిండ్ల రమేశ్, రవీందర్‌గౌడ్, ఉర్దొండ వనీత, పిడుగు మమత, ఆస్మా అఫ్రీన్‌లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బీజేపీకి చెందిన మాజీ కౌన్సిలర్లు జూలూరి సుధాకర్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు.

భరోసా దొరక్క..

పార్టీ మారేందుకు రెడీ అవుతున్నా నేతలను వారిని నిలువరించి, భరోసా ఇచ్చేవారు లేని పరిస్థితుల్లో పార్టీ వీడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థాయిలో గులాబీ నేతలతో సమీక్ష సమావేశం జరిగింది. అసెంబ్లీ ఎన్నికల ఓటమిని గుణపాఠంగా తీసుకుని పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ ముఖ్యనేతలు పేర్కొన్నారు. అయినప్పటికీ కొందరు ప్రజాప్రతినిధులు, నేతలు పార్టీనీ వీడుతుండడం విస్మయం కలిగిస్తోంది. కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారు సొంత గూటికి వెళ్తుంటే, బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన వారు కూడా పార్టీ వీడుతున్నారు. జిల్లా కేంద్రమైన కామారెడ్డి మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా జారిపోతున్నారు. దీంతో బల్దియాలో బలం పడిపోతోంది. బీఆర్‌ఎస్‌లో కుమ్ములాటలు సమసిపోలేదనడానికి వలసలు కూడా కారణమని స్పష్టమవుతోంది. పార్లమెంటు ఎన్నికల ముందు మరి కొందరు పార్టీ వీడే ఆలోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ నేతలు కూడా ఎన్నికల సమయంలో ఎక్కువ మందిని చేర్చుకుని ప్రత్యర్థులను డిఫెన్స్‌లో పడేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా గులాబీ నేతలు వలసలను నివారించడంపై దృష్టిసారించి, పార్టీ కేడర్‌కు భరోసా ఇవ్వాలని ఆ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు కోరుతున్నారు.

రహదారులు రక్తసిక్తం

ఉమ్మడి జిల్లాలో రహదారులు రక్తసిక్తమయ్యాయి. శుక్రవారం రెండు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మరణించగా.. ఎడపల్లి మండలం జాన్కంపేట వద్ద జరిగిన ప్రమాదంలో మరో ఇద్దరు మృతిచెందారు.

- బుల్లెట్ బైక్ ఢీకొని ఇద్దరి మృతి
- హైవేపై జంగంపల్లి వద్ద ఘటన



వెంకటి, నిఖిల్‌రెడ్డి మృతదేహాలు

భిక్కనూరు: భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి 8.30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. దోమకొండ మండల కేంద్రానికి చెందిన నాయి నిఖిల్‌రెడ్డి(22) తన స్నేహితుడైన పున్న సుమంత్‌తో కలిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం కామారెడ్డికి వెళ్లారు. దోమకొండకు తిరిగి వస్తుండగా.. అదే సమయంలో సైకిల్‌పై రోడ్డు దాటుతున్న జంగంపల్లి గ్రామానికి చెందిన గుండా వెంకటి (45)ని వేగంగా ఢీకొన్నారు. వెంకటి అక్కడికక్కడే మృతి చెందాడు. బుల్లెట్‌పై ప్రయాణిస్తున్న నిఖిల్‌రెడ్డి, అబ్రబోయిన సుమంత్‌లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని కామారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా నిఖిల్‌రెడ్డి మార్గమధ్యలో మృతి చెందాడు. సుమంత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెంకటి తాను పనిచేస్తున్న దాబా హోటల్‌లో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై అసువులు బాసాడు. వెంకటికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన తల్లి ఇటీవల మృతి చెందింది. నిఖిల్‌రెడ్డి ట్రావెల్ నిర్వాహకుడుగా పనిచేసేవాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరు మృత్యువాత



సమీర్ (ఫైల్)



అనాస్ (ఫైల్)

ఎడపల్లి (బోధన్): ఎడపల్లి మండలం జానకంపేట్ సమీపంలోని అశోక్ సాగర్ వద్ద శుక్రవారం సాయంత్రం 7 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన సమీర్ (28), అనాస్(30), కరీం కలిసి బైక్‌పై పని నిమిత్తం బోధన్ వైపు వెళ్తున్నారు. అశోక్ సాగర్ మూలమలుపు వద్ద ముందున్న ఐచర్ వ్యాన్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా అతి వేగంగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఆ తాకిడికి బైక్ పక్కనున్న ఐచర్ వ్యాన్‌కు ముగ్గురు ఢీకొని కారు కింద పడిపోయారు. ఈ ఘటనలో సమీర్, అనాస్ అక్కడికక్కడే మృతి చెందారు. మృత దేహాలను 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కరీంను మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. ఆరో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మిల్లింగ్ లక్ష్యాలను పూర్తి చేయాలి



చిన్నమల్లారెడ్డిలోని రైస్‌మిల్లును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

- అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం: జిల్లాలోని రైస్‌మిల్లర్లు ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన బియ్యం టార్గెట్ నెలాఖరులోగా పూర్తయ్యేలా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలోని రైస్‌మిల్లును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైస్ మిల్లుల యజమానులు రోజువారీ లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. లక్ష్యాలు పూర్తిచేయని మిల్లుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. లక్ష్యం పూర్తి చేయని మిల్లులను సీజ్ చేసి యజమానుల పై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, పౌరసరఫరాల సంస్థ డీఎం అభిషేక్ సింగ్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

మీసేవ, ఆన్‌లైన్ ద్వారా రైతులు చేసిన ఎఫ్ లైన్ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ లైన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించినవి, పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సర్వేఅండ్‌రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, అధికారులు సాయి భుజంగరావు, సంతోష్, రాము, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యాలను సాధించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: హరితహారం లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. అధికారులు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. కలెక్టరేట్‌లో హరితహారంపై శుక్రవారం ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025, 2026లకు గాను వివిధ శాఖల ద్వారా మొక్కలు నాటడానికి లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. ఔషధ, నీడ నిచ్చే, పూల మొక్క లు, రహదారుల వెంట పెద్ద మొక్కలు నాటాలని ఆదేశించారు. 2024 సంవత్సరంలో 26.40 లక్షల మొక్కలు, 2025లో 17.92 లక్షల మొక్కలు నాటడానికి కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. 2026 వచ్చే నాటికి మొక్కలు నాటే ప్రణాళికలను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటాలని పేర్కొన్నారు. ప్రధానంగా కరివేపాకు, మునగ, ఉసిరి, చింత, వెలగ వంటి మొక్కలతో పాటు తులసి, అలోవేరా, రణపాల లాంటి ఔషధ మొక్కలు నాటాలన్నారు. కోతులు గ్రామాలు, పట్టణాల్లో సంచరించకుండా ఉండేందుకు అడవుల్లో పండ్ల మొక్కలు నాటాలని సూచించారు. చెట్లు నరికే వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, డీఆర్‌డీవో సాయన్న, డీఏవో భాగ్యలక్ష్మి, పశు సంవర్ధక అధికారి సింహారావు పాల్గొన్నారు.



కామారెడ్డిలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా వివేకానంద జయంతి

స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. పట్టణాలు, గ్రామాల్లో బీజేపీ, హిందూవాహిని, ఏబీవీపీ, తపస్, వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో వివేకానంద స్వామి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు సూచించారు.

- వివరాలు లోపలి పేజీల్లో..

లక్ష్యం.. శత శాతం..

- 'పది' పరీక్షలకు సన్నద్ధం
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు
- వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



సదాశివనగర్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై విద్యాశాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు అన్ని పాఠశాలల్లో టెన్త్ సిలబస్ 90శాతం పూర్తయినట్లు చెబుతున్నారు. అలాగే విద్యాశాఖ సూచించిన ప్రణాళిక మేరకు ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వీటి వల్ల విద్యార్థుల్లో కొంత ఆత్మవిశ్వాసం పెరుగుతోందని ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక పాటు విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు ఎదురవుతున్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని పెడుతూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. గత ప్రశ్నాపత్రాల్లో అడిగిన ప్రశ్నలు.. ఏ స్థాయిలో అడిగారనే విషయాన్ని విద్యార్థులకు వివరిస్తున్నారు. అంతకంటే రెట్టింపు స్థాయిలో ప్రశ్నలను గుర్తించి సాధన చేయిస్తున్నారు.

జిల్లాలో పాఠశాలల వివరాలు..

జిల్లాలో ఉన్నత పాఠశాలలు 189, ప్రాథమికోన్నత పాఠశాలలో 128, ప్రాథమిక పాఠశాలలు 697 ఉన్నాయి. కేజీబీవీ 19, మైనారిటీ వేల్ఫేర్ పాఠశాలలు-06, ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్ ఈఐఎస్ పాఠశాలలు-07, నవోదయ-01, ప్రైవేట్ ఎయిడెడ్ -01, ప్రైవేట్ ఎయిడెడ్ ఓరియంటల్ స్కూల్-1, ప్రైవేటు అన్ ఎయిడెడ్-79, స్టేట్ పాఠశాలలు-06, మోడల్ స్కూల్-06, టీఎస్ ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ స్కూల్స్-11,టీఎస్ టీడబ్ల్యూ ఆర్ ఈఐ సొసైటీ స్కూల్స్-04, టీఎస్ ఆర్‌ఈఐ సొసైటీ స్కూల్స్ 01, టీడబ్ల్యూ డిపార్ట్‌మెంట్ ఆశ్రమ్ పాఠశాలలు-01 ఉన్నాయి. ఈ పాఠశాలలకు చెందిన 1,266 మంది విద్యార్థులు త్వరలో పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారు.

ఉత్తమ ఫలితాల కోసం తీసుకుంటున్న చర్యలివే..

- విద్యార్థుల స్థాయి ఆధారంగా గ్రూపులుగా విభజించి ఒక్కో గ్రూప్‌నకు ఒక ఉపాధ్యాయుడిని ఇన్‌చార్జీగా నియమించారు. వెనుకబడ్డ విద్యార్థుల కోసం ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. గ్రూప్‌లో ఉన్న విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై పూర్తిస్థాయి పట్టు సాధించేలా కృషి చేస్తున్నారు.
- పాత ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు ఇస్తూ ప్రాక్టీస్ చేయిస్తున్నారు. గతంలో పరీక్ష పత్రంలో అడిగిన ప్రశ్నల తీరుపై పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తున్నారు.
- 15 రోజులకోసారి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ వెనుకబడ్డ విద్యార్థుల గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. అన్ని అంశాలపై ప్రధానోపాధ్యాయులు సమీక్ష నిర్వహిస్తున్నారు. వచ్చేనెలలో నిర్వహించే రెండు గ్రాండ్ టెస్టుల కోసం విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.
- విద్యార్థులు పరీక్షల సమయంలో సమయాన్ని వృథా చేయకుండా వచ్చిన ప్రశ్నలను ముందుగా రాస్తే ఇబ్బందులు ఉండవని వివరిస్తున్నారు. రాని ప్రశ్నల కోసం ఆలోచిస్తూ సమయాన్ని వృథా చేయవద్దని సూచనలు చేస్తున్నారు.
- చదివిన అంశాలపై విద్యార్థులకు స్టడీ అవర్‌లో గ్రూప్ డిస్కషన్ నిర్వహిస్తున్నారు.

ప్రణాళికతో చదువుతున్నాం



టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రణాళిక ప్రకారం చదువుతున్నారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మంచి ఫలితాలు వస్తాయనే నమ్మకం ఉంది.
–ఎస్ గౌతం, టెన్త్ విద్యార్థి, సదాశివనగర్

10 జీపీఏ సాధించడమే లక్ష్యం



టెన్త్ ఫలితాల్లో 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా చదువుకుంటున్నాను. వెనుకబడిన విద్యార్థులకు కూడా ప్రోత్సాహాన్ని ఇస్తూ వారిలో భయాన్ని పోగొట్టి ప్రశ్నలను సాధన చేయించడానికి కృషి చేస్తున్నాం. ప్రత్యేక తరగతుల నిర్వహణ ఎంతో ఉపయోగపడుతోంది. – చిట్టిపు శృతి, టెన్త్ విద్యార్థిని, సదాశివనగర్

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా..



పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులతో సమీక్షలు నిర్వహిస్తూ ప్రత్యేక తరగతుల నిర్వహణ తీరుపై చర్చిస్తున్నాం. వంద శాతం ఫలితాలే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. –రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి,కామారెడ్డి

క్లుప్తంగా

హిమాలయ పర్వతాన్ని అధిరోహించిన విద్యార్థి



ఎల్లారెడ్డిరూరల్: మండల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి సమీర్ హిమాలయ పర్వతాన్ని అధిరోహించినట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. సమీర్ ఈనెల 2 నుంచి 12వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో నిర్వహించే జాతీయ ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపునకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అక్కడ ట్రైనర్ సోనమ్‌తో కలిసి సముద్రమట్టానికి 2875 మీటర్ల ఎత్తులో ఉన్న హిమాలయ పర్వతాన్ని అధిరోహించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థి సమీర్‌ను అధ్యాపకులు కృష్ణప్రసాద్, జయప్రకాశ్, ప్రభాకర్‌రావు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఫరీదుపేట విద్యార్థిని



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేట ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.శీర్షిక రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ నాగరాజు తెలిపారు. ఈ నెల 16,17,18వ తేదీలలో జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కబడ్డీ పోటీలలో శీర్షిక పాల్గొననున్నట్లు ఆయన చెప్పారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్‌మనోహర్ రావు, ఎస్‌ఎంసీ చైర్మన్ గంగాధర్, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

నూతన చట్టాన్ని ఉపసంహరించుకోండి



కామారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన వాహన చట్టాన్ని వ్యతిరేకిస్తూ కామారెడ్డి ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీ యజమానులు, డ్రైవర్లు ధర్నా చేపట్టారు. శుక్రవారం కామారెడ్డి శివారులోని గిడ్డంగుల వద్ద ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఏఎంసీలపై ఆశావహుల కన్ను

- 2016 నుంచి రిజర్వేషన్లను కేటాయించిన గత ప్రభుత్వం
- వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం
- రిజర్వేషన్ల కొనసాగింపుపై స్పష్టత కరువు



ఆర్మూర్ ఏఎంసీ కార్యాలయం

ఆర్మూర్: రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లను రద్దు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో అధికార పార్టీ నాయకుల్లో, ఆశావహులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్‌లకు రిజర్వేషన్ల కేటాయింపును ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందా లేక తొలగిస్తుందా అనే విషయమై స్పష్టత రాలేదు. జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలు నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, వర్ని, కమ్మర్‌పల్లి, కోటగిరి, వేల్పూర్‌లతో పాటు కిసాన్‌నగర్‌లో సబ్ యార్డు ఉన్నాయి. ఈ ఏడు మార్కెట్ యార్డులకు చైర్ పర్సన్‌లతో పాటు పాలకవర్గాన్ని నామినేటెడ్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. 2016లో నాటి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌ల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు చైర్ పర్సన్ స్థానాలను కేటాయిస్తూ మొదటి సారిగా రిజర్వేషన్ పద్ధతిని ప్రారంభించింది. ఐదు పర్యాయాలు చైర్‌పర్సన్ పీఠానికి రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ఆధారంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కేటాయించిన రిజర్వేషన్ల ఆధారంగా బీఆర్‌ఎస్ నాయకులను మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పీఠాలకు నామినేట్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న చైర్ పర్సన్‌లు రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుంటూ తమ పదవీ కాలాన్ని విడతల వారిగా పెంచుకుంటూ వచ్చారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో వీరు పదవులు కోల్పోవాల్సి వచ్చింది. కానీ అధికారికంగా ఇంకా ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించే నాయకులను నామినేటెడ్ చేసే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. అయితే ఆయా పార్టీలలో రాజకీయ నిరుద్యోగులకు కమిటీల్లో అవకాశం కల్పిస్తూ బుజ్జగించే ధోరణి ఏళ్ల తరబడి కొనసాగుతూ వస్తోంది. అదే ప్రక్రియ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనూ కొనసాగనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే రిజర్వేషన్లు పాటిస్తారా? లేదా అనే అంశం ప్రధానంగా చర్చకు వస్తోంది.

దివ్యాంగులకు మారథాన్ పోటీలు


మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై కొమరయ్య

కామారెడ్డి అర్బన్: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ రోడ్డులో దివ్యహస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మారథాన్ పోటీలు నిర్వహించారు. మారథాన్‌ను ఎస్సై కొమురయ్య జెండా ఊపి ప్రారంభించారు. దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి ఈ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకురాలు పోశవ్వ పేర్కొన్నారు. అనంతరం విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దివ్యహస్తం ప్రతినిధులు చింతల పోశవ్వ, లక్ష్మీపతి, చిరంజీవి, ఏడుకొండలు, మంజుల, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

ఊడిపడిన పైకప్పు పెచ్చులు

- త్రుటిలో తప్పిన ప్రమాదం


పరిశీలిస్తున్న సర్పంచ్ సాయిలు, టీచర్ సబిత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లి అంగన్‌వాడి కేంద్రంలో శుక్రవారం ఉదయం పైకప్పు పెచ్చులూడిపడ్డాయి. ఆ సమయంలో చిన్నారులు కేంద్రానికి రాకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. రోజూమాదిరిగానే శుక్రవారం ఉదయం ఆయా గాలవ్వ అంగన్‌వాడి కేంద్రానికి చేరుకొని గదులను శుభ్రం చేస్తోంది. ఈ క్రమంలో అంగన్‌వాడి కేంద్రంలోని వంటగది తలుపులు తీయగానే పైకప్పు నుంచి పెచ్చులూడి కిందపడ్డాయి. విషయం తెలుసుకున్న అంగన్‌వాడి టీచర్ సబిత కేంద్రానికి వెళ్లి విషయాన్ని గ్రామ సర్పంచ్ దేశబోయిన సాయిలు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సర్పంచ్ సాయిలు కేంద్రానికి చేరుకొని ఊడిపడిన పైకప్పు పెచ్చులను పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు.

తెలుగు సాహిత్యంలో అమరుడు అలిశెట్టి


నివాళులర్పిస్తున్న తెరవే ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: కవిగా తన పదాలకు చిత్రకారునిగా రూపం ఇచ్చి వచన కవిత్వానికి వన్నెతెచ్చిన అలిశెట్టి ప్రభాకర్ తెలుగు సాహిత్యంలో అమరుడిగా నిలిచారని తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అన్నారు. అలిశెట్టి ప్రభాకర్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో తెరవే ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలిశెట్టి ప్రభాకర్ సమాజంపై గురిపెట్టి రాసిన పలు కవితలను తెరవే ప్రతినిధులు గంగాప్రసాద్, వైద్య శేషారావు, బి.నాగభూషణం, చంద్రకాంత్, సురేష్, సాయికుమార్‌లు గానం చేశారు.

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డిలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా చిన్నారులు, పెద్దలు గోదాదేవి, శ్రీ కృష్ణుని వేషధారణలతో కోలాటం ఆడారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ క్రిష్టాజిగారి రత్నాబాయి, ఆనంద్ రావు, భక్తులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంతో అధిక దిగుబడులు



మాచారెడ్డి : రైతులు సుస్థిర వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని వికసిత్ భారత్ నోడల్ అధికారి హేమంత్ కుమార్ అన్నారు. పాల్వంచ మండలం మంథని దేవునిపల్లిలో శుక్రవారం సుస్థిర వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ వ్యవసాయంతో చీడపీడల బారి నుంచి పంటలను రక్షించుకోవచ్చని అన్నారు. అలాగే డ్రోన్ సాయంతో క్రిమిసంహారక మందులు ఎలా పిచికారీ చేయాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. ప్రొగ్రాం అధికారి ప్రవీణ్ కుమార్, డ్రోన్ ఇన్‌చార్జి రంజిత్ కుమార్, రైతులు ఉన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతులు


బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ నరేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): సురాయిపల్లిలో యువశక్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు శుక్రవారం లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ బహుమతులు అందజేశారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించినట్లు యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మన్నె కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలో యువత పాత్ర చాలా కీలకమన్నారు. యువత సమాజ సేవను వదిలి స్వార్థ రాజకీయాలకు బలికావద్దన్నారు. రాజ్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్, రంజిత్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగుతున్న కేపీఎల్ టోర్నీ


పోటీలో తలపడే జట్లతో నిర్వాహకులు

బాన్సువాడ రూరల్: కొత్తాబాదిలో సంక్రాంతి సెలవుల నేపథ్యంలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన కొత్తాబాది ప్రీమియర్ లీగ్ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. వివిధ గ్రామాల నుంచి క్రీడాకారులు వచ్చి పోటీలో తమ సత్తా చాటుతున్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకుంటున్నారు.

ఈఎన్‌టీ క్లినిక్ సీజ్

నిజామాబాద్‌నాగారం: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆర్మూర్‌లోని నక్షత ఈఎన్‌టీ క్లినిక్‌ను వైద్యశాఖ అధికారులు తనిఖీచేసి శుక్రవారం సీజ్ చేశారు. జిల్లా వైద్యశాఖ ఆదేశాల మేరకు ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, డెమో గంగాధర్, డాక్టర్ వెంకటేశ్, డీహెచ్‌ఈ రమ తనిఖీ చేపట్టారు. అనుమతి లేకుండా నడుపుతున్నందుకు ఈఎన్‌టీని సీజ్ చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

వర్ని: మండలంలోని సైదిపూర్‌లో పంట చేనుకు వేసిన కరెంటు తీగ తగిలి గేదె మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన హంగోత్ హున్న మక్కా పొలానికి అనుమతి లేకుండా కరెంటు తీగలు పెట్టగా అదే గ్రామానికి చెందిన కేతావత్ నాణ్యకు చెందిన గేదె ప్రమాదవశాత్తు తగిలి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

బిల్లు కడితేనే మృతదేహం ఇస్తాం

- నగరంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాకం
- బంధువుల ఆందోళనతో వెనక్కి తగ్గిన యాజమాన్యం

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నయీం అనే వ్యక్తి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం బిల్లుల విషయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 5న నయీం పోతంగల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. తలకు తీవ్రగాయం కావడంతో వైద్యులు ఆపరేషన్ చేశారు. అనంతరం చికిత్స పొందుతూ నయీం మృతి చెందాడు. చికిత్స కోసం అయిన రూ. 2 లక్షల బిల్లు కడితేనే మృతదేహం ఇస్తామని ఆస్పత్రి యాజమాన్యం చెప్పడంతో బాధిత కుటుంబీకులు ధర్నాకు దిగారు. దీంతో బిల్లు చెల్లించకపోయినా ఆస్పత్రి యాజమాన్యం మృతదేహాన్ని అప్పగించింది.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

నస్రుల్లాబాద్: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై లావణ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన టి.గోపి(28) మద్యానికి బానిసయ్యాడు. నిత్యం ఇంట్లో గొడవలు జరిగేవి. ఈ క్రమంలో గురువారం రాత్రి తన గదిలో నిద్రించిన గోపి ఉదయం తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు పగులగొట్టి చూడగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ శుక్రవారం తీర్పులో పేర్కొన్నారు. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన వేముల శివయ్య డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. శివయ్యను కోర్టులో హాజరుపర్చగా మూడు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు ఏసీపీ నారాయణ పేర్కొన్నారు.

భిక్కనూరులో బైక్ చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలో ఓ బైక్ శుక్రవారం చోరీకి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పున్న గంగయ్య మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎంకు బైక్‌పై వచ్చాడు. బైక్‌ను ఏటీఎం ఎదుట నిలిపి లోపలికి వెళ్లి వచ్చే లోగా దుండగులు చోరీ చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మాజీ సర్పంచ్ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రెంజల్: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. బోధన్ మండలం కొప్పెర్గ గ్రామం నుంచి మండలంలోని నీలా శివారులో డంప్ చేసేందుకు శుక్రవారం తెల్లవారుజామున తీసుకొస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుబాయిలో బోనాల్ వాసి మృతి

లింగంపేట: మండలంలోని బోనాల గ్రామానికి చెందిన గరిగె ప్రభాకర్(32) దుబాయిలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు.. ప్రభాకర్‌కు భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఎనిమిది నెలల క్రితం ఆయన దుబాయి వెళ్లాడు. అప్పటి నుంచి ఆచూకీ లేదు. ప్రభాకర్ ఆచూకీ కోసం తండ్రి పర్వయ్య అనేక ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఈ క్రమంలో మనస్తాపంతో పర్వయ్య మూడు నెలల క్రితం మృతిచెందాడు. కాగా ప్రభాకర్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. శుక్రవారం మృతదేహం హైదరాబాద్‌కు చేరుకున్నట్లు సమాచారం రావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వివాహేతర సంబంధానికి నిండుప్రాణం బలి..

మూడురోజుల్లోనే హత్య కేసును ఛేదించిన పోలీసులు


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ

డిచ్‌పల్లి: వివాహేతర సంబంధానికి ఓ నిండుప్రాణం బలైంది. ఈ నెల 8న ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి శివారులో హత్యకు గురైన లవుడ్య నరేశ్ (21) హత్య కేసును పోలీసులు మూడు రోజుల్లో ఛేదించి నిందితుడిని పట్టుకున్నారు. డిచ్‌పల్లి సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలను సీఐ కృష్ణ వివరించారు. వెంగల్‌పాడ్ తండా (పాటితండా)కు చెందిన నరేశ్ గత నెల డిసెంబర్ 30న ఇంటినుంచి వెళ్లి తిరిగిరాలేదని తల్లి నీల ఫిర్యాదు మేరకు ఇందల్వాయి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 8న నరేశ్ మృతదేహం తిర్మన్‌పల్లి శివారులోని రైలు పట్టాలపై కనిపించింది. ఘటన స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ ఇందల్వాయి ఎస్సై మహేశ్‌తో కలిసి పరిశీలించగా బండరాయితో మోది హత్య చేసినట్లు గుర్తించారు. మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేపట్టారు. హతుడు కనిపించకుండా పోయిన రోజున అతడితో పాటు కేకే తండాకు చెందిన కేతావత్ రాజేశ్‌తో కలిసి తిర్మన్‌పల్లి కల్లుబట్టి వద్ద కలిసి కల్లుతాగి వెళ్లినట్లు విచారణలో తేలింది. సాంకేతిక ఆధారాలతో ఇందల్వాయి పోలీసులు నిందితుడు రాజేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం..

రాజేశ్ భార్యతో నరేశ్ కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయాన్ని స్వయంగా గుర్తించిన రాజేశ్ భార్యతో గొడవ పడ్డాడు. నరేశ్‌ను చంపితే కానీ సమస్య పరిష్కారం కాదని భావించిన రాజేశ్ గత నెల 30న పక్కా ప్లాన్ ప్రకారం పాటితండాకు చేరుకున్నాడు. నరేశ్‌ను కల్లు తాగుదామని పిలిచి తిర్మన్‌పల్లి కల్లుబట్టి వద్దకు తీసుకెళ్లాడు. కల్లుతాగిన తర్వాత బాగా మత్తులో ఉన్న అతన్ని రైలుపట్టాలకు కొద్దిదూరంలో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి తలపై బండరాయితో మోది హత్య చేశాడు. ఈ నెల 8న మృతదేహం లభించడంతో విచారణ చేపట్టిన పోలీసులు పరారీలో ఉన్న రాజేశ్‌ను ఈ నెల 11న అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నేరం అంగీకరించడంతో అతడి వద్ద నుంచి మృతుడికి సంబంధించిన సెల్‌ఫోన్‌తో పాటు ఘటన స్థలం వద్ద హత్యకు ఉపయోగించిన బండరాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్, హెడ్‌కానిస్టేబుళ్లు రాజేశ్వర్, ప్రసాద్, కానిస్టేబుళ్లు సర్దార్, సతీశ్, కిశోర్, రామును సీపీ కల్మేశ్వర్, ఏసీపీ కిరణ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ శివారులో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఏర్గట్ల మండలం తడ్‌పాకల్‌కు చెందిన సంతోష్(45) అక్కడికక్కడే మృతి చెందాడు. బాల్కొండ ఎస్సై గోపీ శుక్రవారం తెలిపిన వివాల ప్రకారం.. సంతోష్ మూడు రోజుల క్రితం కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న తన తండ్రి వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో రాత్రికి ఆరు బయటకు వెళ్లగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కింద పడి యువకుడు..

ఖలీల్‌వాడి: రైలు కింద పడి గుర్తు తెలియని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం తెలిపారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్మూర్‌కు వెళ్లే రైలు పట్టాలపై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 8712658591, 9440999341 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

భర్త మృతి తట్టుకోలేక భార్య..


పుల్ల రాములు (ఫైల్)


పుల్ల పుష్పమ్మ (ఫైల్)

నాగిరెడ్డిపేట: తోడూ నీడై నిలిచిన భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో తట్టుకోలేని భార్య తనువుచాలించిన ఘటన మండలంలోని మాసాన్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పుల్ల రాములు (64) గత నెల డిసెంబర్ 25న అనారోగ్యంతో మృతి చెందాడు. నాటి నుంటి భర్త గురించి ఆలోచిస్తూ అనారోగ్యానికి గురైన భార్య పుష్పమ్మ(57) మృతి చెందింది. కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

ఆరుగురిపై కేసు నమోదు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన తనిఖీలో ఆరుగురు మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

రుద్రూర్: కోటగిరి శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపారు. వీరి నుంచి రూ. ఆరువేలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..


సాయికుమార్ మృతదేహం

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన నాగారం సాయి కుమార్ (22) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై నీరేశ్ శుక్రవారం తెలిపారు. మద్యానికి బానిసైన సాయికుమార్ ప్రతి రోజు ఇంట్లో డబ్బుల కోసం గొడవ పడేవాడు. కుటుంబీకులు డబ్బులు ఇవ్వనందున బుధవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న సాయికుమార్ గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేషన్‌షాపుపై అధికారుల దాడి

- 85 క్వింటాళ్ల బియ్యం తేడా
- రేషన్ డీలర్‌పై కేసు నమోదు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలం తాడ్కోల్‌లోని 6వనెంబర్ రేషన్‌షాపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈపాస్ యంత్రంలో స్టాక్ రిజిష్టర్‌ను గ్రౌండ్‌బ్యాలెన్స్‌తో సరి చూడగా తేడా వచ్చింది. 85 క్వింటాళ్ల బియ్యం తేడా ఉన్నట్లు గుర్తించిన అధికారులు రేషన్‌డీలర్ గంగాధర్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం రాలేదు. దీంతో రేషన్‌డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సత్యనారాయణ తెలిపారు. రేషన్ షాపును సీజ్ చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలో అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు పట్టణ కేంద్రానికి చెందిన సల్లావుద్దీన్ ఇంట్లో దాడులు చేయగా 60 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. టాస్క్ ఫోర్స్ సీఐలు అంజయ్య, అజయ్ బాబు, సిబ్బంది ఉన్నారు.

కిలో గంజాయి స్వాధీనం

ఖలీల్‌వాడి: నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో గంజాయి అమ్ముతున్న ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరహరి శుక్రవారం తెలిపారు. నగరంలోని ఖలీల్‌వాడికి చెందిన సయ్యద్ సాజిద్ అలీ వద్ద 1250 గ్రాముల గంజాయి, రూ. 10 వేల నగదు స్వాధీనం చేస్తున్నట్లు తెలిపారు. చంద్రశేఖర్ కాలనీలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారంతో అందడంతో నిందితుడిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన ఆనీస్ వద్ద కొనుగోలు చేసి రూ. 200లకు ప్యాకెట్ అమ్ముతున్నట్లు చెప్పారు. ఎస్సై ప్రవీణ్, సిబ్బంది అఫ్సర్, షౌకత్ అలీ, గంగ కుమార్, లీలా కృష్ణ ఉన్నారు.